1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మహబూబ్‌నగర్

సోమవారం | మార్చి 31.2025 | www.navatelangana.com

ఆంజనేయస్వామి నిర్మాణం కోసం భూమిపూజ

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ డెస్క్



రాజాపూర్ మండలంలోని సింగమ్మగూడ తాండ గ్రామ పంచాయతీలో గల శ్రీఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం కోసం స్లాబ్ వేస్తున్న సందర్భంగా ఆదివారం పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌నాయక్, కాంగ్రెస్‌మండల యూత్ అధ్యక్షులు గణేష్ నాయక్,యువ నాయకులు రాఘవేందర్‌నాయక్, రాధాకృష్ణ నాయక్, బాబునాయక్, నారాయణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి



నవాబుపేట మండల పరిధిలోని లింగం పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న పాలు కేంద్రంలో చలివేంద్రాన్ని ఉగాది పర్వదినాన గ్రామస్తులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో వచ్చి పోయే ప్రజలకు తాగునీటి కోసం వేసవి విడిదిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేవామని చెప్పారు.అన్ని దానాలలో పాటు తాగునీరు దానం చేస్తే పుణ్యం లభిస్తుందన్నారు. ఏదో ఒక రూపంలో సేవ భావాన్ని కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాఘవేందర్ రెడ్డి ,రాంరెడ్డి ,కొంగళ్ళ కృష్ణయ్య, జింకల రాములు, శ్రీరాములు ,జింకల నవీన్ ,కర్రొళ్ళ యాదయ్య ,మాసయ్య, కొన్నింటి నర్సింలు కొంగళ్ళ కృష్ణయ్య, రమేష్ ,రాజు బంటి పవన్ విఘ్నేష్ ,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

- మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- కులమతాలకు అతీతంగా అందరు కలిసి మెలిసి ఉండాలి

నవతెలంగాణ- మహబూబ్‌నగర్

అన్ని వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి నిధులతో హమాలీ సంఘం సభ్యులు కోసం నిర్మించిన విశ్రాంతి షెడ్ ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సరం మీ అందరికి శుభాలను, ఆనందాన్ని , ఆరోగ్యాన్ని అందించాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా అందరు కలిసి మెలిసి ఉండాలని ఆయన చెప్పారు. అంతకుముందు హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి మహేందర్, నాయకులు మైత్రి యాదయ్య, నాగరాజు, గోనె శ్రీనివాస్, ముకుందం రమేష్, చంద్రమౌళి, డీలర్ రఘు, తెలుగు గూడెం ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సిఐ అప్పయ్య, హమాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సాగుభూమి కరువై... బతుకు బరువై

నేను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టగానే ఎకరాకు రూ.15 లక్షలు ప్యాకేజీ కింద రూ.25లు, ఖాళీ జాగా గజం 10 వేల వరకు ఇస్తానని,జాగా దొరకకుంటే నేను 50 ఎకరాలు కొని ఇండ్లు నిర్మించి ఇస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే హామీని దాటవేస్తున్నారు.నెల రోజులుగా న్యాయమైన ప్యాకేజీ ఇవ్వాలని చేస్తున్న దీక్షవైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఉద్దండాపూర్ రైతులు తెలిపారు.ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం భూములు తీసుకొన్నారని మిగితా 20 శాతం సాగు అవుతున్న భూముల్లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని అంటున్నారు. సాగునీటి ప్రాజెక్టు పూర్తయితే తమ పంట పొలాలు నీరవస్తాదనే రైతులకు కడుపుశోకమే మిగిలింది.పాలమూరు ఎత్తిపోతలలో బాగంగా నిర్మించిన ఉద్దండాపూర్ రిజర్వాయర్ పూర్తయితే పరిసర ప్రాంతాలలోనూ... భూములన్నీ నీటి వసతితో అన్ని పంటలు సమృద్ధిగా పండి రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగవుతోందని ఆశపడ్డ రైతులకు నిరాశా దక్కింది.ఏడాదంతా పచ్చని పంటలతో ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండే గ్రామాలు నేడు కంట్రోల్ బియ్యం తిని కాలం గడుపుతున్నా పరిస్థితులు నెలకొన్నాయి. వల్లూరు,ఉద్దండాపూర్ గ్రామాల ప్రజలు రిజర్వాయర్‌లో సర్వం కోల్పోయాం. నేడు ఉపాధి లేక ప్రజలు బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. గత నెల రోజులుగా సరైన పరిహారం ఇవ్వాలని ఆర్‌ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరుతూ వల్లూరు, ఉద్దండపూర్ గ్రామస్తుల దీక్షలు చేస్తున్న సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం.

- జీవితాలను వెల్లదీస్తున్న నిర్వాసితులు
- ఉద్దండాపూర్ రైతుల దీనావస్థ
- కడుపునింపుతున్న కంట్రోల్ బియ్యం
- నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి
- దీక్షలో నిర్వాసితులు
- ఇచ్చిన హామీని దాటవేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి





పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్మిస్తున్న ఉద్ధండాపూర్ రిజర్వాయరులో సాగుభూమి, ఆవాసాలు ముంపుకు గురయ్యాయి. సాగుభూమి తీసుకొని అరకొర పరిహారం చెల్లించారు.ఏడాదికి రెండు పంటలు సాగయ్యే భూములకు ఐదు లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇచ్చిన డబ్బులు బ్యాంకులో ఉన్న అప్పుకు సరిపోనూ... మిగిలితే మా పిల్లల పెండ్లీలు చేశాం.ఇప్పుడు చేతిలో చిల్లి గవ్వ లేదు. సాగు భూమలు పోయి కూలీ పనులు దొరకడం లేదు. దీంతో కంట్రోల్ బియ్యం కారం మెతుకులతో కాలం వెల్లదీస్తున్నామని వల్లూరు, ఉద్దండాపూర్ గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జడ్చర్ల మండలం ఉద్దండాపూర్ గ్రామ పరిధిలో చామగడ్డ తండా, ఒంటి గుడిసెలు ఉన్నాయి. వల్లూరు గ్రామ పరిధిలో రేగటిపాటి తండా, చిన్నగుట్టతాండ, తుమ్మగుట్టతాండ ఆవాసాలు ఉన్నాయి. ఉద్దండాపూర్‌లో 8000 మంది జనాభా వల్లూరు పరిధిలో 3000 మంది జనాభా ఉన్నారు.ఈ రెండు గ్రామాల నుండి 5435 ఎకరాల సాగు భూమిని సేకరించారు. ఎకరాకు రూ. 5.50 రెండు పంటలు సాగయితే 6.50 లక్షలు ఇచ్చారు. ఇందులో 2 8 5



ఎకరాలకు సంబంధించిన రైతులు ఎకరాకు రూ. 15 లక్షలు ఇవ్వాలని కోర్టుకు వెల్లారు. 2021 ఫిబ్రవరి చివరినాటికి 18 ఏళ్ల పైబడిన వారికి ప్యాకేజీ, బార్య, భర్తలకు ఒక ప్యాకేజీ నిర్ణయించారు. ఉద్దండాపూర్‌లో 1695 మంది, వల్లూరులో 980 మందిని అర్హులుగా తేల్చారు. బార్య, భర్తకు రూ. 16.30 వేల 200లు 18 ఏళ్ల పైబడిన వారికి రూ. 16.50 లక్షలుగా నిర్ణయించారు. ఈ ప్యాకేజీని గ్రామాల ప్రజలు అంగీకరించడం లేదు. భార్య భర్తలకు రూ. 25 లక్షలు, రూ.18 ఏళ్ల పైబడిన వారికి రూ.25 లక్షలు ఇవ్వాలని వీరు కోరుతున్నారు. ఖాళీ జాగా గజానికి రూ. 3500 ఇస్తామని నిర్ణయిం చగా నిర్వాసితులు మాత్రం రూ.10వేలు ఇవ్వాలని అడుగు తున్నారు. న్యాయమైన డిమాండ్ కోసం ఆందోళన చేస్తున్న ఈ రెండు గ్రామాల ప్రజలపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు.13 మందిపై కేసులు పెట్టారు. ఆందోళన చేస్తున్న రైతులందరిపై కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారు.ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యే గుడిముందు ప్రమాణం చేసి న్యాయమైన డిమాండ్‌తో పాటు ఇంటి స్థలాలు ఇచ్చి ఇండ్లను నిర్మించి ఇస్తామని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత నిర్వాసితుల గోడు పట్టడం లేదని గ్రామస్తులు తెలిపారు. .



ఉద్దండాపూర్ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి



ఉద్దండపూర్ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి. ఇల్లు లేక సాగు భూమి లేక ఉపాధి కరువై అనేక మంది ఆకలితో అలమటిస్తున్నారు. చారిత్రాత్మకంగా ఉన్న వల్లూరు, ఉద్దండాపూర్ గ్రామాలను తరలించాలంటే ముందు వారికి పునరావాసం కల్పించాలి.ఎకరాకు రూ. 25 లక్షలు చెల్లించాలి.

ఎ. రాములు,
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి,
మహబూబ్‌నగర్

ఆవాసాలు నిర్మాణం చేయాలి



నిర్వాసితుల ప్యాకేజీ నేటి ధరల కనుగుణంగా లేదు. 10 ఏళ్ల క్రితం పాక్యేజీ ఇప్పుడు అమలు చేస్తే సరికాదు.ముఖ్యంగా నాటి నుండి ధరలు నాలుగు రెట్లు పెరిగాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా భూమికి ఇంటికి భార్యభర్తలకు సింగిల్ వ్యక్తికి ప్యాకేజీ పెంచి ఇవ్వాలి.

యాట రామకృష్ణ, ఉద్ధండాపూర్, జడ్చర్ల మండలం

మెమెలా బతకాలి



మాతాతల నాటి నుంచి ఉన్న ఐదు ఎకరాల సాగు భూమి రిజర్వాయరు లో ముంచారు. ఇప్పుడు నాకు ఐదు సెంట్ల భూమి కూడాలేదు. ఇక్కడ ఇల్లు లేక సాగు భూమి లేక మేము బతికేది ఎలా. రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన మా కోర్కెలను తీర్చాలని కోరుతున్నాం. ఎకరాలకు 15 లక్షలు బార్యభర్తలకు 25 లక్షలు 18 ఏళ్ల పైబడిన వారికి 18 లక్షలు ఇవ్వాలని కోరుతున్నాం.

సిద్ధాపూర్ అయ్యప్ప రైతు, ఉద్దండాపూర్, జడ్చర్ల మండలం

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ డెస్క్

రాజాపూర్ మండల్ తిర్మాలపూర్ గ్రామంలో బీఆర్ ఎస్ పార్టీ యువనేత శ్రీ చించోడ్ అభిమన్యు రెడ్డి తన సొంత ఖర్చులతో చిరు కానుక గా ముస్లిం సోదర సోదరిమణులకు రంజాన్ తోఫాలను అందజేశారు.ఈ సందర్భంగా అభిమన్యు రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో అభిమన్యు యువసేన మండల అధ్యక్షులు రామకృష్ణ గౌడ్,గ్రామ అధ్యక్షులు పుల్లారెడ్డి,యువత మండల అధ్యక్షులు బంగారి వెంకటేష్,డిప్యూటీ సర్పంచ్ శంకర్ నాయక్ దాచాని శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఎన్నం కుమార్, సలాం పాషా పి నర్సిములు చంద్రయ్య, అనిల్‌కుమార్, సురేందర్ రెడ్డి, మహమ్మద్, సద్దాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉచిత భోజనం



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ డెస్క్

నవాబుపేట మండల కేంద్రానికి సంత కొరకు (అంగడి) చుట్టుముట్టు గ్రామాల నుంచి తండాల నుంచి దాదాపు 70 గ్రామాల నుండి వచ్చే ప్రజల కొరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత భోజనం ముప్పై వారాలుగా విజయవంతంగా కొనసిందని జేకే ట్రస్ట్ చైర్మన్ నర్సింహ చారి తెలిపారు.దీంతో పాటు ఉదయం 6 గంటలకు ఫతేపూర్ మైసమ్మ దేవాలయ ప్రాంతం దగ్గర వానర సమూహమునకు (కోతులకు) పండ్లు కూరగాయలు ఆహారముగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జేకే ట్రస్ట్ డైరెక్టర్,మండల వ్యాపార సంఘ అధ్యక్షులు సుధాకర్ చారి నవాబుపేట డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ పుట్టి ఆంజనేయులు పుట్టోనిపల్లి లోకేష్ నవాబుపేట డెవలప్మెంట్ కమిటీ వైస్ చైర్మన్ టంకర నిరంజన్, జేకె ట్రస్ట్ డైరెక్టర్ హృదయ్ పవిత్ర చారి,పుట్టి మహేష్ కుమార్,నాగలింగం,రఘు, నరేష్ పాల్గొన్నారు.

విశ్వావసు నామ ఉగాది అందరికీ విజయాలను అందించాలి : ఎమ్మెల్యే

నవ తెలంగాణ- మహబూబ్ నగర్



విశ్వావసు నామ ఉగాది అందరికీ విజయాలను, కీర్తిని అందించాలని, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా మహ బూబ్ నగర్ పట్టణం లోని శిల్పారామంలో ఆదివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పంచాంగ శ్రవణ కర్త శ్రావణ్ కుమార్ పంచాంగ శ్రవణం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ ప్రజలంతా శ్రీ విశ్వావసు నామ సంవత్సరం లో సుఖసంతోషాలతో ఉండాలని ప్రతి ఒక్కరికి వారి ఆశలు ఆకాంక్షలు నెరవేరాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.శ్రీ విశ్వావసు నామ ఉగాది అందరికీ విజయాలను, కీర్తిని అందించాలన్నారు.అలాగే పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు వ్రాసిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన 12 మంది ప్రముఖులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పి వెంకటేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ,హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వి.మహేందర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబే ఖధర్ వేడుకలు

నవతెలంగాణ- మహబూబ్ నగర్

జిల్లా కేంద్రం సద్దల్ గుండ్ లోని అలీ బా అబ్దుల్లా మసీదులో శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో రంజాన్ మాసం షబే ఖదర్ వేడుకలు నిర్వహించారు. మౌలానా గులాం మహమ్మద్ ధార్మిక సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్క ముస్లిం ఖురాన్‌లో పఠించాలని కోరారు. రంజాన్ స్ఫూర్తితో నిరుపేదలకు సేవలు చేయాలని కోరారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబెదుల్ల కొత్వాల్ రంజాన్ మాసంలో పూర్తి ఖురాన్‌ను చదివి వినిపించిన హాఫీజ్ సాబ్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం కొత్వాల్ ను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు రెహమాన్ సోఫీ, హాజీసలీం, మౌలానా ముబారక్, అబ్దుల్ ఖాదర్, జహంగీర్ బాబా, జిలాని, అలీ బేగ్, మహమ్మద్, నజీర్, రఫీ, రహీం, హాశం, నదీం మోసిన్, తఖీ, అజహర్,, ఫుర్ ఖాన్, ఫసి, మజీద్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అవేజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మన సంస్కృతిని మనమే కాపాడుకోవాలి

- మన సంస్కృతి ఉట్టిపడేలా పాలమూరు ఉగాది ఉత్సవాలు
- ఆటపాటలతో ఉరుతలుగిన వేడుకలు
- సాంస్కృతిక వేదిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి జిల్లా అధ్యక్షులు బెక్యం జనార్ధన్, మాజీ రాష్ట్ర సాంస్కృతిక మండలి చైర్మన్ శివకుమార్



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

పండుగలు అంటేనే మన నిత్యజీవితంలో చేసుకునే పనులను కుటుంబ సభ్యులు సమేతంగా ఆనంద గడుపుకుని మన సంస్కృతిని మనమే కాపాడుకోవాలని సుద్దాల హనుమంతు సాంస్కృతిక వేదిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి జిల్లా అధ్యక్షులు బెక్యం జనార్ధన్, మాజీ రాష్ట్ర సాంస్కృతిక మండలి చైర్మన్ శివకుమార్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ కళా భవనంలో సుద్దాల హనుమంతు సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పాలమూరు ఉగాది ఉత్సవాలను నిర్వహించారు. సందర్భంగా బట్టలు మాట్లాడుతూ కల కోసం కాదు సమాజం కోసమని మరోసారి గుర్తు చేశారు. కవులను కళాకారులను అందరిని ఒక వేదికపై తీసుకువచ్చి మన సంస్కృతిని వృత్తిపడేలా ఈ ఉత్సవాలు ఏర్పాటు చేశామన్నారు. పాలమూరు జిల్లా అంటే కళాకారుల జిల్లాగా గుర్తింపు ఉందని వారు అన్నారు. మానవాళిలో భాగంగా మన సంస్కృతిని ప్రజలకు తెల్పడమే మా లక్ష్యం అన్నారు. గత నెలలోనే ఈ వేదిక ద్వారా పాలన జూనియర్ కళాశాల



లో ఉత్సవాలు నిర్వహిస్తే దాదాపు 1000 మంది కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించిన విషయం గుర్తు చేశారు. మరొక్కసారి ఈ ఉగాది పండుగ ని పురస్కరించుకొని మన సాంప్రదాయ పద్ధతులు ,మన అభిరుచులు , మన సంస్కృతిలో ప్రజలకు తెలియజేసే ందుకు అంబేద్కర్ కళా భవనంలో ఆదివారం సాయం కాలం 5 గంటలకు పాలమూరు ఉగాది ఉత్సవాలు నిర్వహి స్తున్న వారు వెల్లడించారు. ఈ ఉత్సవాలలో జానపద నృత్యం ,శాస్త్రీయ నృత్యం, కోలాటం, జానపద పాటలు, సినీ పాటలు కవి సమ్మేళనం , డాన్సులు ,ఆట పాటలు ఉంటాయని వెల్లడించారు. మన సాంస్కృతి సాంప్రదాయాల పైన ప్రపంచ దేశాల దాడులను తిప్పికొట్టేందుకు ఈ వేదిక ఒక సువర్ణ అవకాశమని తెలిపారు. పాలమూరు జిల్లా అంటేనే ఆటపాటలకు నిలయమని మరొక్కసారి గుర్తు చేద్దామని తెలిపారు. ఈ ఉత్సవాలలో సీనియర్ కళాకారులను సన్మానించారు..ఈ ఉత్సవాలలో జిల్లాలోని కళాకారులు కళాభిమానులు కవులు డాక్టర్లు లాయర్లు పట్టణ ప్రజలు పాల్గొని విశ్వనామ తెలుగు సంవత్సర ఉగాది సాంప్రదాయా వైభవాని ప్రపంచానికి చాటుదమని పిలుపునిచ్చారు.ముఖ్య అతిథులుగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ ఇతర ప్రముఖులు పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో బి కురుమూర్తి ,సీనియర్ కవులు పాల్గొన్నారు.



ఉగాది ఉషస్సులు

- మండల వ్యాప్తంగా విశ్వావసు కి స్వాగతం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు,పచ్చడి పంపిణీ

నవతెలంగాణ మహమ్మదాబాద్



విశ్వావసు నమ తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆదివారం మండల వ్యాప్తంగా ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. .మహమ్మదా బాద్, గాదిర్యాల్, నంచర్ల ఆయా గ్రామాలలో ఆంజనేయస్వామి ఆలయా ల్లోని పంచాంగం నిర్వహించారు. అనంతరం సేకటోత్సవం లు అంగరంగ వైభవంగా కొనసాగాయి. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడుగా ఫిల్టర్ ఇసుక దందా

- కేసులైనా షరామామూలే

అంటున్న ఇసుకాసురులు

నవతెలంగాణ నవాబు పేట



నవాబుపేట మండలం పరిధిలోని పలు గ్రమాలలో ఇసుక మాఫియా గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతుంది. ఇసుక అక్రమ రవాణాకు అలవాటు పడిన కొంతమంది అక్రమార్కులకు ఇది తమకు షరామామూలే అంటూ ఆ దందా వారోకి కాసుల వర్షం కురిపిస్తుంది .గత కొన్ని రోజులుగా పోలీసులు గస్తీకాసి, కేసులు నమోదు చేసి,జరిమానాలు విధించినా ఇసుక అక్రమార్కుల తీరుమారడం లేదు.పోలీసుల కళ్ళుకప్పినట్టుగా కదలికలను పసిగట్టి ఈ తాతంగానికి పాల్పడు తున్నారు.సాధారణంగా వేసవికాలంలో భవన నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుంటాయి.దీన్ని క్యాష్ చేసుకునేందుకు అక్రమార్కులు పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు.

ఇసుక దందా జరిగిన సహించేది లేదు: ఎస్‌ఐ విక్రమ్

ఇసుక మాఫియా పై ఉక్కు పాదం మోపెందుకుపై ఎస్పీ సహ ఉన్నతాధికారుల ఆదేశాలునాయి. గత కొన్ని రోజులుగా ఇసుక టిప్పర్లు, ఇసుక ట్రాక్టర్లు పట్టు పడ్డ వాహనాల పై కేసులు నమోదు చేసి తహసీల్దార్ కు బైండోవర్ చేయడం జరిగింది.ఇకపై ఎక్కడ ఇసుక దందా జరిగిన సహించేది లేదు. తమకు సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచుతూ అక్రమ ఇసుక రవాణాకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

• రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి



నవతెలంగాణ-పెబ్బేరు

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని రాంపురం గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దపీట వేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల అభివృద్ధి మరంత వేగంగా జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గిరకలాగుడు పోటీలు



నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు మండల పరిధిలోని పిన్నంచర్ల గ్రామంలో ఉగాది సందర్భంగా నిర్వహించిన ఎద్దుల గిరికలాగుడు పోటీలు అలరించాయి. ఈ పోటీల్లో రైతులు అధిక సంఖ్యలో తమ ఎద్దులతో తరలి వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మ చ్చేందర్ గౌడ్, గ్రామ పెద్దలు శివశంకర్, శివానందరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాములు, మాసన్న, తిరుపతయ్య, రాజన్న, విష్ణు, గ్రామస్తులు అశోక్ నంద, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

• మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న రావుల చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-పెబ్బేరు

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మాజీ ఎంపీ రావుల చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ చివరి రోజు సందర్భంగా ఆయన పెబ్బేరు మజీద్‌లో ముస్లింకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా వారితో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ రంజాన్, ఉగాది పండుగలు హిందూ ముస్లింలు సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల, అశోక్, మండల అధ్యక్షుడు వనం రాములు, కర్రేస్వామి, రాజశేఖర్, దిలీప్ రెడ్డి, ఎద్దుల సాయికుమార్, సోషల్ మీడియా కన్వీనర్ వడ్డేరమేష్, నాయకులు వేణు యాదవ్ ,ఎల్లారెడ్డి, గోల్డ్ బాలస్వామి, సాయిరెడ్డి, మాధవ్‌రెడ్డి, సంతోష్. ఎండీ.గౌస్, ముద్దుసార్, సందీప్ రెడ్డి, జూదంవెంకటేష్, అమరేందర్,అఖిల్ చారి,వేణు,షేకిల్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బార్‌కౌన్సిల్ ఈసీ సభ్యుడికి ఘన సన్మానం



న్యాయవాది శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-పెబ్బేరు

వనపర్తి జిల్లా బార్ కౌన్సిల్ ఈసీ మెంబెర్‌గా ఎన్నికైన న్యాయవాధి ఎస్.శ్రీనివాస్ గౌడ్‌ను ఆదివారం తోమాలపల్లి గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శ్రీనివాస్‌గౌడ్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్, మన్యం, మహదేవయ్య కే.రాముడు, రంగన్న యాదవ్, చంటి, రమేష్ కుమార్, ఉమేష్ గౌడ్, అశోక్, శివకుమార్, మాలపల్లి రామన్‌గౌడ్, ఎర్ర సాయిలు, ఉపాధ్యాయులు రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-ఆత్మకూరు

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సహకారంతో ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నచింతకుంట మండలం అల్లిపురం గ్రామంలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి నరేందర్, రాజు ఆత్మకూరు, రెండవ బహుమతి గట్టన్న ,శివ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు, మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా , కాంగ్రెస్ నాయకులు తులసిరాజు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పీపీఎల్ 8 విజేతలకు..



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ- పెబ్బేరు

పెబ్బేరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో నిర్వహించిన పీపీఎల్ (పెంచికలపాడు ప్రీమియర్ లీగ్) 8 విజేతలకు జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్క శ్రీనివాస్ గౌడ్ ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అక్కి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడల వల్ల యువకులు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలన్నారు. మొదటి బహుమతి జయన్న నాయుడు ప్రదానం చేయగా రెండవ బహుమతి అక్కి శ్రీనివాస్ గౌడ్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్ సాగర్, బుర్ర ముని రాములు యాదవ్, సురేందర్‌గౌడ్, నరేష్, గోవిందు నాయుడు, నరసింహనాయుడు, సింగోటం తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ- ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏప్రిల్ 1వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తిప్పుడంపల్లి ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ సురేందర్ గౌడ్ ఆదివాకం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, కంటి సమస్యలున్న 50 సంవత్సరాల పైబడ్డ వారు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డు, రేషన్ కార్డు తీసుకొని రావాలని సూచించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మహబూబ్‌నగర్‌లో కంటి ఆపరేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం

పోరాటాలకు సిద్ధం కావాలి

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పుట్టాంజనేయులు



రాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నవతెలంగాణ-వీపనగండ్ల

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో సీపీఎం గ్రామ కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అధ్యక్షతన శనివారం రాత్రి కామ్రేడ్ రాములు ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు పుట్ట ఆంజనేయులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి.జబ్బర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు రాములు చిత్రపటానికి ఆయన సతీమణి వెంకటేశ్వరమ్మ, కుమారుడు విక్రమ్, కుమార్తె సుష్మ కుటుంబ సభ్యులు పార్టీ కార్యకర్తలతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ రాములు విద్యార్థి దశ నుంచే ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామంలో పార్టీ అభివృద్ధికి, పేదల సమస్యల పరిష్కారం కోసం, ప్రజల పక్షాన ముందుండి పోరాడారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సర్వేలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ప్రజా పోరాటంలో కార్యకర్తలు ప్రజలను సమీకరించి పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు కూలి పెంచడం లేదన్నారు. ఈ పథకానికి నిధులు తగ్గిస్తూ పథకం ఎత్తివేసేందుకు కుట్ర చేస్తుందని, కార్మిక చట్టాలను కాలరాస్తుందన్నారు. నిత్యావసర ధరలను అదుపు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తూ ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా అరకొరగా అమలు చేస్తూ కాలయాపన చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. హామీల అమలు కోసం రానున్న రోజుల్లో చేపట్టే ఆందోళన పోరాటాల్లో ప్రజలను భాగస్వాములు చేసి పోరాటలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి.జబ్బార్ మాట్లాడుతూ రాములు అధ్యయనం చేస్తూ విద్యార్థులు, ప్రజలను చైతన్య పరిచేందుకు క్లాసులు బోధించారన్నారు. కార్మిక, రైతు, విద్యార్థి, ఉద్యోగ, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ గ్రామంలో పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికి డబ్బులున్నాయి కానీ ఇచ్చిన హామీలను అమలు చేయడానికి డబ్బులు లేవా అని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా గత ప్రభుత్వం, కేసీఆర్‌పై నిందలు వేస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. గోపాల్ దిన్నె , సింగోటం రిజర్వాయర్ లింకు కాలువ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, భూములు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం కృష్ణయ్య, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, మండల కార్యదర్శి డి.బాల్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు గ్రామ కన్వీనర్ బాలగౌడ్, మండల కమిటీ సభ్యులు నాగరాజు, వి.కృష్ణయ్య, గ్రామ నాయకులు వెంకటస్వామి , రంగస్వామి, రామకృష్ణ, శివ, ఈ.తిరుపతయ్య, ఈశ్వరయ్య మహిళా సంఘం నాయకురాలు వెంకటమ్మ, ఓ మేశ్వరమ్మ, రాణి ,చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన సీపీఎం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు



వర్ధంతి సభలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

ఘనంగా విశ్వావసు సంవత్సర వేడుకలు

• ఆలయాల్లో ప్రత్యేక పూజలు
• సాయంత్రం పంచాంగ శ్రవణాలు

నవతెలంగాణ- మదనాపురం

మదనాపురం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆదివారం తెలుగు సంవత్సరాది (విశ్వావసు) ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి షడ్రుచులతో చేసిన పచ్చడి, తీపి వంట కాలను నేవేద్యంగా సమర్పించి కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు. సాయంత్రం ఆలయాల వద్ద పురోహితులు పంచాంగం చదివి వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రజలకు విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.



మదనాపురంలో పంచాంగం వింటున్న ప్రజలు

ఉగాది వేడుకల్లో వాకర్స్ క్లబ్ సభ్యులు

పెబ్బేరు : ఉగాది పండుగ సందర్భంగా పట్టణంలోని ఆదర్శ వాకర్స్ క్లబ్ సభ్యులు గ్రామంలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి డ్రెస్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాంగ పఠనం

ఆత్మకూరు: పట్టణ ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గుండాచారి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్ల పరమేశ్వర స్వామి దేవాలయం కమిటీ సభ్యులు వెంకట నరసింహారావు, మణివర్ధన్ రెడ్డి, వెంకట రాఘవ, మొగిలి గంగాధర్ గౌడ్, ఎస్‌టిడి శ్రీనివాసులు, విఠల్ రావు, వెంకట్ రెడ్డి, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో పంచాంగం చదువుతున్న పురోహితులు



పెబ్బేరులో డ్రెస్‌కోడ్ విడుదల చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

గురుకుల ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ- పెబ్బేరు



ఆకాష్

పెబ్బేరు మండలం ఏటిగడ్డ శాఖాపూర్ ప్రగతి విద్యాలయం విద్యా ర్థి గురుకుల ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటినట్లు కరస్పాం డెంట్ భీమ్‌సాగర్ తెలిపారు. ప్రతి సం వత్సరం తమ పాఠశాల విద్యార్థులు గురు కులాలో అధిక సీట్లు సాధి స్తున్నారన్నారు. ఈ సారి మా పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. కొత్త కోట మండలం నాటవెళ్లి గ్రామానికి చెందిన లక్ష్మి, నాగేంద్రం కుమారుడు ఈ.ఆకాష్ తమ పాఠశాలలో 4వ తర గతి చదువుతూ గురుకుల ప్రవేశ పరీక్ష రాయగా రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్య వ్యాపారీకరణతో కాకుండా సేవా దృక్పదంతో పేద, మధ్య, దిగువ మధ్యతరగతి విద్యారులకు నామ మాత్రం ఫీజులతో నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. కరస్పాండెంట్ భీంసాగర్ తోపాటు పాఠశాల ప్రిన్సిపాల్ రిజో, ఉపాధ్యాయులు పాఠశాల సమయం లోనే కాకుండా విద్యార్థులను ఇంటి దగ్గరే ఉంచుకొని గురుకుల కోచింగ్ అం దిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు గురు కుల ప్రవేశ పరీక్షలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థి ఆకాష్‌తో పాటు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఉపా ధ్యాయ సిబ్బందిని ప్రశంసిస్తున్నారు.

మోట్లపల్లి విద్యార్థి ..



ఆత్మకూరు: మండలం మోట్లపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలకు చెందిన వై.అజిత్ ఇటీవల వెలుబడిన గురుకుల ఫలి తాల్లో రాష్ట్ర 319 వర్యాంకు సాధిం చినట్లు గ్రామ స్తులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వీరన్న ,విజయ్, గ్రామ స్తులు విద్యార్థి అజిత్‌ను అభి నందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ- ఆత్మకూరు

ఆత్మకూరు మండల పరిధిలోని రేచింతల గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మణ్ తండ్రి ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆత్మకూర్ బీఆర్ఎస్ నాయకులు భౌతికాయానికి పూల మాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మూలమల షరీఫ్, రేచింతల బీఆర్ఎస్ నాయకులు వెంకటన్న తిరుపతయ్య ,లక్ష్మణరావు, బీసన్న ,తదితరులు పాల్గొన్నారు.

పండగపూట విధుల్లో సిబ్బంది

నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు మండల కేంద్రంలో ఆదివారం తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా సెలవు దినం అయినా మున్సిపల్ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ చెల్లించుటకు చాలామంది ప్లాట్లదారులు వచ్చి చెల్లించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం నందు సిబ్బంది విధులు నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం సోమవారంతో ముగుస్తుండడంతో ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్ని కార్యాలయాల్లో కార్యకలాపాలు కొనసాగేలా ఆదేశాలు జారీ చేసింది.

వేతనాలు లేక పారిశుధ్య కార్మికుల ఇబ్బందులు

నవతెలంగాణ- పాన్‌గల్

గ్రామపంచాయతీ కార్మికులకు 5 నెలల నుంచి వేతనాలు లేక వస్తులతో జీవనం కొనసాగిస్తున్నారు. పానగల్ మండలంలో 28 పంచాయతీలకు గాను 130 మంది కార్మికులు పని చేస్తున్నారు. వారికి ఐదు నెలల నుండి వేతనాలు లేక పోవడంతో అప్పులు చేసి కార్మికులు జీవనం గడుపుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు . తెల్లవారుజాము నుంచి గ్రామాల్లో చెత్తాచెదారం తొలగించి, శుభ్రం పరుస్తూ, హరితరంలో మొక్కలకు ట్రాక్టర్ ద్వారా నీళ్ల పోస్తూ విధులు నిర్వహిస్తున్నారు. పరిశుద్ధ కార్మికుల సేవలను మరువరానిదని పాలకులు ప్రజాప్రతినిధులు ప్రచారం చేస్తున్నారే తప్పా వారికి శ్రమకు తగ్గ వేతనం చెల్లించేందుకు చర్యలు తీసుకోవడం లేదంటున్నారు.



చాలీచాలని వేతనం అది కూడా నెల నెల రాకుండా నాలుగైదు నెలలకోసారి చెల్లిస్తుడడంతో కుటుంబ పోషణ భారమవుతుందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.9500 చెల్లిస్తూన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ పాలన పూర్తయి ఏడాది దాటిన ఎన్నికలు నిర్వహించకపోవడం, గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులకు పర్యవేక్షణ చేయటం, గ్రామాల అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడంలేదని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులకు వేతనాలు రావడం లేదని కార్మికులు విన్నవిస్తున్నా వేతనాలు రావడం లేదని చెప్పడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెల ఉద్యోగస్తులకు ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని ప్రచారాలు చేసుకుంటుంది కానీ గ్రామపంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లిని చలం లేదు. వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనలు చేపట్టి, వినతి పత్రాలు అందించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నెల నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
సోమవారం | మార్చి 31, 2025 | www.navatelangana.com

పూలే విగ్రహా ఆవిష్కరణకు ఎమ్మెల్యే వాకిటి దంపతులకు ఆహ్వానం



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ డెస్క్

బిజినేయపల్లి మండల కేంద్రంలో ఏప్రిల్ 9న మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకొని నూతనంగా ఏర్పాటు చేసిన పూలే విగ్రహా ఆవిష్కరణకు హాజరు కావాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్, లలితమ్మ దంపతులను విగ్రహా ఆవిష్కరణ కమిటి నాయకులు పీఏసీఎస్ చైర్మన్ నాయినోళ్ళ బాల్‌రాజు గౌడ్, దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు మంగి విజయ్, రాజేందర్ గౌడ్ ఆహ్వానించినట్లు తెలిపారు. పూలే విగ్రహా కమిటి నాయకులు ఆదివారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్వగృహానికి వెళ్ళి లలితమ్మను శాలువాతో సన్మానించి కుటుంబ సమేత హాజరు కావాలని కోరినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సమయం ఇచ్చిన అనుకోకుండా ముఖ్య కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హైదారాబాద్‌కు బయలుదేరి వెళ్ళడంతో లలితమ్మకు ఆహ్వానం అందజేసినట్లు పేర్కొన్నారు. వారి వెంట విగ్రహా ఆవిష్కరణ కమిటి సభ్యులు ఇగరంబంద శ్రీనివాసులు, భగవంత్ గౌడ్, శంకర్ గౌడ్, శివ, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులున్నారు.

అంబేద్కర్ విగ్రహా నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-ఉప్పునుంతల

మండలం కొరటికల్ గ్రామంలో పల్లె దావఖాన ప్రాంతంలో ఆదివారం తెలుగు కొత్త సంవత్సరం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆగమనం సందర్భంగా గ్రామంలోని యువకులు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన పనులు ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటానికి కొబ్బరికాయలు కొట్టి, అంబేద్కర్ నినాదాలు చేసి పనులు మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు చింతల నాగరాజు, కొరటికల్ గ్రామ నాయకులు ప్రకాష్, సైదులు, ఆనంద్, అనిల్, శ్రీశైలం, దిలీప్, లక్ష్మయ్య, రమేష్, సాయితేజ, మాగాని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత



నవతెలంగాణ-కల్వకుర్తి

తెల్లవారుజామున పట్టణ సమీపంలోని కొత్త బైపాస్‌లోని కురుమిద్ద రోడ్డు వద్ద రెండు మినీ టిప్పర్లలో వంగూరు మండలం మిట్టసదగోడు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా కల్వకుర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది పట్టుకొని ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి వాటిపై కేసు నమోదు చేసినట్లు స్థానికై మాధవరెడ్డి తెలిపారు. స్టేషన్‌కి తరలించి ఫిర్యాదు ఇవ్వగా టిప్పర్లపై, టిప్పర్ డ్రైవర్లు, టిప్పర్ ఓనర్లు జకినాలపల్లి గ్రామం ఊరుకొండ మండలానికి చెందిన సురేష్, తలకొండపల్లికి చెందిన సుదర్శన్ అను వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగింది.

పురాతన ఆంజనేయ స్వామి విగ్రహం లభ్యం





నవతెలంగాణ -చారకొండ

మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో ఉన్న రామేశ్వర గుట్టపై నీటి గుండంలో ఆంజనేయ స్వామి పురాతనమైన విగ్రహం లభించింది. ప్రతి సంవ త్సరం తిమ్మాయిపల్లిలోని రామేశ్వర గుట్టపై శ్రీరామ నవమి కళ్యాణోత్సవ కార్యక్రమ జరుగుతుంది. కళ్యాణోత్సవ కార్యక్రమం పనుల నిమిత్తం గ్రామ యువత గుండంలో శుభ్రం చేస్తుండగా ఐదు కిలోల పంచలోహ ఆంజనేయ స్వామి విగ్రహం లభించింది. కార్యక్రమంలో శ్రీపతి రావు, జైపాల్, రాజేష్, సాయిబాబు, రాజు, కృష్ణయ్య, సత్యం, నాగరాజు ఉన్నారు.

విజేతలకు బహుమతులందజేత



నవతెలంగాణ- పెంట్లవెల్లి

మండలంలోని వివిధ గ్రామాలలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఇందులో భాగంగా మంచాలకట్ట గ్రామంలో గ్రామ పెద్దల సమక్షంలో క్రికెట్, కబడ్డీ, పరుగు పందెం, ఉల్లిగడ్డ పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతి రూ.2వేలు, రెండవ బహుమతి రూ.1000 అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని చెన్నపురావుపల్లి మందుల బాలస్వామి అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలిసిన మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాధిత కుటుంబానికి గ్రామ సొసైటీ తీర్మానం ప్రకారం కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయంగా, రూ.5వేలు గ్రామ సొసైటీ అధ్యక్షుడు చందు, వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు పుట్ట కాసిం, కార్యదర్శి అనుకలి లక్ష్మణ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నెంబర్ పుట్ట రాముడు తదితరులు పాల్గొన్నారు.

దప్పిక తీర్చేందుకే చలివేంద్రం

- గ్రామ యువకులు
- గాజరలో చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-వంగూరు

వంగూరు మండలంలోని గాజర గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రస్తుతం ఎక్కువగా ఎండలు ఉండడంతో దప్పిక తీర్చేందుకే చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించామని గ్రామ యువకులు కొమ్ము శ్రీను, దొడ్డు మల్లేష్, మహేష్ గౌడ్ తెలిపారు. అన్ని దానాలకన్నా నీళ్ల దానం గొప్పది అనుచందంగా గ్రామస్తులు, బాటసారులు దప్పిక తీర్చేందుకే చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. గ్రామస్తులు అందరు సహకరిస్తే ఇక ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ము రాజయ్య, పురుషోత్తం, రమేష్, రాజు గౌడ్, శ్రీను గౌడ్, గణేష్, యోగేశ్వర్, జంగయ్య, హుస్సేన్, కొండల్, సైదులు, ఖాసిం, నాగరాజు, శ్రీపతి గౌడ్, అంజనేయులు, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఏడాది దాటినా..

ఖాళీగా ఎంపీపీ, జడ్పీటీసీ కుర్చీలు

- ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేదెట్లా..?
- సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నవతెలంగాణ-వంగూరు

వంగూరు మండలంలోని 27 గ్రామపంచాయతీలు ఉండగా, ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు యొక్క సమస్యలను ఎవరికి చెప్పుకోలేని అయోమయంలో ఉన్నామని గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నారేమోనని అధికారుల చుట్టూ తిరిగితే ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని అక్కడ మీసేవ దగ్గరికి వెళితే కొత్త రేషన్ కార్డు కావాలంటే ప్రస్తుతం తల్లిదండ్రుల కార్డులో డిలీట్ అయితే తప్ప కొత్త రేషన్ కార్డుకు అవకాశం లేదని లేనిపోని రూల్స్ పెట్టి 10ఏండ్ల నుంచి కూడా కార్డులు లేని వారి సంఖ్య కోకొల్లలు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదువుకున్న విద్యార్థులకైతే ఉన్న కార్డులో డిలీట్ అయితే



కొత్త కార్డు రాకపోతే లేనిపోని ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని భయాందోళనకు గురి అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలకు గాను రెండు మాత్రమే ఫుల్ ఫిల్ కావడం మిగతా వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగితే మాకు పైనుంచి ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదని అధికారులు పొంతన లేని సమాధానం చెప్పి కాలయాపన చేస్తున్న సందర్భాలు చాలా ఉన్నాయని ప్రజలు ఎల్లపుచ్చుతున్నారు. ప్రజల యొక్క సమస్యలను చెప్పుకుందామంటే సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటీసీలు లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. గ్రామాలలో ఉండే పంచాయతీ కార్యదర్శుల విషయానికి వస్తే ఏడాదిన్నర ముందే 14 ఫైనాన్స్ రాకపోవడంతో గ్రామాలలో సమస్యలను తీర్చడానికి మా సొంత డబ్బులు కూడా పెట్టి మేమే సతమతమవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచులు మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీలు గతంలో అప్పు తెచ్చి చేసిన పనులకు బిల్లులు ఇప్పటివరకు రాలేదని తమ గోడు చెప్పుకుంటున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతోనే ఎన్నికలు నిర్వహిస్తలేరని పలువురు చర్చించుకుంటున్నారు.

జూన్ నెలలో ఎలక్షన్లు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే ఎంపీటీసీ ఎంపీపీ జడ్పిటిసి సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహిస్తే తప్ప గ్రామాలలో సమస్యలు పరిష్కారం కావని ప్రజలు అంటున్నారు.

> కొత్తగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సర్పంచులు, ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి ప్రజాప్రతినిధులను ఎన్నుకొని ప్రజల మధ్యలో ఉండి ప్రజల యొక్క సమస్యలను తీర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటదనుకుంటే, నేటి వరకు కూడా ఎన్నికలు నిర్వహించకపోవడంలో ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏడాది దాటినా కూడా సర్పంచులు, ఎంపీపీ, జడ్పీటీసీ కుర్చీలు ఖాళీగా ఉండడం ప్రజల అందరికీ చర్చనీయాంశంగా మారిందని చెప్పవచ్చు.

వైభవంగా ఉగాది పర్వదిన వేడుకలు







నవతెలంగాణ-తెలకపల్లి

మండల కేంద్రంలో, పరిసర గ్రామాల్లో ఆదివారం తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మామిడి తోరణాలతో గృహ అలంకరణ చేసి నూతన వస్త్రాలు ధరించి ఉగాది షడ్రుచుల పచ్చడి సేవించారు. ఉగాది ప్రత్యేకమైన భక్షాలు, పిండి వంటలు చేసి బంధువులు, కుటుంబ సభ్యులు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు, అనంతరం గ్రామాలలోని గ్రామపంచాయతీ ప్రాంగణలలో వేద పండితులు ఆయా గ్రామాలలో పంచాంగ శ్రవణం చేసి ఈ సంవత్సరం పంటలు, వర్షాలు, ఆదాయ వివరాలు, రాశి ఫలాలు, రైతులకు ప్రజలకు వివరించారు.

తిమ్మాజిపేట : మండలంలో అన్ని గ్రామాలలో విశ్వసు నామ సంవత్సరం ఉగాదిని సంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షడ్రుజుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చని తయారు చేసే కుటుంబ సభ్యులు సంహితులతో కలిసి సేవించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ పంచాయతీలలో, రచ్చబండలు ఆలయాల్లో పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. మండలంలోని తిమ్మాజీపేట, అప్పాజీపల్లి, పోతిరెడ్డిపల్లి, ఆవంచ తదితర గ్రామాలలో పంచాంగ శ్రావణానికి ప్రజలు పాల్గొన్నారు.

వంగూరు : ఉగాది పండుగ పురస్కరించుకొని తెలుగు సంవత్సరాలలో ఉగాది పండుగతో సంవత్సరం మారుతుందని నమ్మకంతో భక్తులు పురోహితుని చే పంచాంగం చెప్పించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తుల నమ్మకం విశ్వవసు నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరు పేరు బలాలు, ఖర్చు ఎంత, ఆదాయం ఎంత ఒక నమ్మకంతో పురువాయితుడు చెప్పే పంచాంగాన్ని వింటారు. అదేవిధంగా రైతులు యాగడి సాగటం గుద్దలి ఒక చెంబులో నీళ్ల తీసుకొని ఎవరితోని మాట్లాడకుండా తన పొలంలోకి వెళ్లి పొలం పనులు మొదలుపెట్టే రోజు ఉగాది పండగ రోజు వంటి కార్యక్రమాలు చేపడతారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేష్ రావు, మాజీ ఎంపీటీసీలు యాదగిరిరావు, రమేష్ గౌడ్, ఆలయ మాజీ చైర్మన్‌లు జువ్వ కృష్ణయ్య, వెంకటేశు, రమేష్, ఎల్లా గౌడ్, సురేష్, శేకర్, బాలస్వామి, యాదయ్య, సాయిలు, రవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వెల్దండ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఆదివారం తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజలు ఉదయాన్నే తమ ఇండ్లను శుభ్రపరచుకుని మామిడి తోరణాలతో అలంకరించారు. సాయంత్రం గ్రామంలోని ఆలయాల వద్ద వేద పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. కార్యక్రమంలో వెల్దండ మాజీ సర్పంచ్ యన్నం భూపతిరెడ్డి, విజేందర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, బీజేపీ మండల అధ్యక్షులు కురుమిద్దె యాదగిరి, కాంట్రాక్టర్ శశిపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, క్యాసారపు వెంకటయ్య, పిల్లి దేవేందర్ ముదిరాజ్, పుల్లయ్య, రంగయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఊరుకొండ : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకల్లో భాగంగా తీపి, చేదు కలగలిపినదే జీవితం.. కష్టం సుఖం ఉంటేనే నిజమైన జీవితం.. నూతన జీవితాన్ని పూయించేందుకు వచ్చినదే ఉగాది పర్వదినం.. ఈ ఉగాది అందరి జీవితాలలో ఆయురారోగ్యాలు.. అష్టైశ్వర్యాలు, సుఖ, సంతోషాలు కోరుకుంటూ.. ఆయా గ్రామా ప్రజలు ఉగాది పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రజలంతా ఇల్లు చక్కబెట్టుకొని నూతన వస్త్రాలు ధరించి.. రకరకాల పిండివంటలతో ఉగాది పచ్చడితో పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెలుగు నూతన సంవత్సరాది విశ్వవసు నామ సంవత్సరం గతంలో 1905-1965 తెలుగు సంవత్సరాలలో ఇది 39వ ఏడాది కలియుగంలో ఇది 5126వ సంవత్సరమని.. ఈ ఏడాది అధిపతి సూర్య భగవానుడని పండితులు బోధించారు. ఉగాది పర్వదినం రోజు సాయంత్రం ఆయా గ్రామాల్లో వేద పండితుల సమక్షంలో ప్రజలందరూ పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, ఈత పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక తరలిస్తే ఊరుకోమంటున్న రైతులు

- ఇసుక తరలిస్తే బోరు బావిలు ఎండిపోతాయనీ నిరసన



నవతెలంగాణ-వంగూరు

ఇసుకను అక్రమంగా తరలించుటకు దళారులు సిద్ధం చేసుకున్న రోడ్డు హిటాచీలు, టీపర్లు ఇసుక తరలిస్తే ఊరుకోమని రైతులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఇసుకను తరలిస్తే రైతుల బోర్లు ఎండిపోతాయి అన్న జాజాల గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకముందు గృహ నిర్మాణాలకు అనుమతులివ్వని అధికారులు ఇప్పుడు ఎట్లా ఇసుక తరలింపు అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. మండల రెవెన్యూ, పోలీసు అధికారుల చర్య తీసుకుని అక్రమ ఇసుకను ఆపాలన్నారు. ఒకవేళ అనుమతులు ఇచ్చినా కూడా రైతులందరం కలిసి జాజాల, పోతరెడ్డిపల్లి గ్రామ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తే అడ్డుకుంటామని జాజాల గ్రామ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. దళారులు ఇసుకను అక్రమంగా తరలించేందుకు ఉల్పార రోడ్డు నుంచి ఇసుకను తీసుకెళ్లి ప్రాంతం వరకు రోడ్డు వేశారన్నారు. అదే ప్రాంతంలో ఈ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రైతు దళారీలతో సంబంధాలు పెంచుకొని ఆ పొలం నుంచి ఇసుకనిస్తానని ముడుపులు పుచ్చుకొని రైతులందరికీ నష్టం కలిగే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. దీన్ని గ్రామ ప్రజలంతా మూకుమ్మడిగా వ్యతిరేకిస్తూ మా ప్రాంతం నుంచి ఒక్క బండి కూడా ఇసుక వెళ్లకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. గతంలో ఈ ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలించవద్దని హైకోర్టులో స్టే ఇచ్చినప్పటికి దళారులు కోర్టు నుంచి వచ్చినటువంటి ఆదేశాలను కూడా ధిక్కరించి యథేచ్ఛగా ఇసుకను తరలించడానికి సన్నద్ధమవుతున్నారని గ్రామ ప్రజలు తెలిపారు. మండలంలోని రెవెన్యూ పోలీసు అధికారుల నిర్లక్ష్యం వల్లనే వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి జాజాల, పోతారెడ్డిపల్లి పరిసర ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల ఈ ప్రాంతం నుంచి రైతులందరిని కదిలించి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను నిలిపివేయాలని కోరుతూ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు కొండల్ రెడ్డి, పర్వత్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి రాజారెడ్డి, జిలకర సైదులు, నరేందర్ రెడ్డి, రోడ్ల బాలస్వామి, గడ్డం చిన్నయ్య, వాడాల లక్ష్మయ్య, జిలకర అంజనేయులు, వేముల కాశన్న, భోగరాజు, సాయిలు, జిలకర పరశురాములు, పులిజాల అశోక్, మార్కొండ సతీష్, జీలకర్ర చిన్న పరుశురాములు, పులిజాల బాలరాజు, పులిజాల నాగరాజు, జానీ పాషా, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసే దగ్ధం

- 30 వేల రూపాయల ఆస్తి నష్టం



నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని దేవుని తిరుమలాపూర్ రోడ్డు చింతచెట్టు దగ్గర బుడగ జంగాల నిదాన కవి లక్ష్మయ్య బ్రతుకుతెరువు కోసం వచ్చి గుడిసె వేసుకొని నివసిస్తూ ఉండగా ఆదివారం దురదృష్టవశాత్తు కరెంటు షార్ట్ సర్క్యూట్ అయ్యి గుడిసెలో మంటలు చెలరేగి బియ్యం, బట్టలు, ఆధారు కార్డులు, పిల్లల బర్త్ సర్టిఫికెట్లు దాచుకున్న పదివేల రూపాయలు మంటలలో కాలిపోనట్లు బాధితుడు లక్ష్మయ్య తెలిపారు. ప్రభుత్వ పరంగా బాధితుడు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం..


మండల పరిధిలోని దేవుని తిరుమలాపూర్ గ్రామంలో బేడ బుడగ జంగాల లక్ష్మయ్య పూరిగుడిస దగ్ధమైన విషయం తెలుసుకున్న మండల బేడ బుడగ జంగాల మండల అధ్యక్షుడు మరియు బేడ బుడగ జంగాల నాయకులు పరామర్శించి మండల బేడా బుడగ జంగాల పోరాట సమితి మండలాధ్యక్షుడు గడ్డం సుభాష్ ఆధ్వర్యంలో కుటుంబానికి ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నిడుగొండ, పెళ్లూరి రేవల్లి మోతె బ్రదర్స్ తదితరులు పాల్గొనడం జరిగింది. దాతలు ఎవరైనా సహాయ సహకారాలు చేయలని అనుకుంటే ఫోన్ పే, గూగుల్ పే నంబర్ : 9492503395 గల నెంబర్‌కు ఫోను ద్వారా ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరారు.



ఆటలకు పనికిరాని క్రీడా స్థలాలు

- చెరువుల్లో, నర్సరీల్లో పాతిన బోర్డులు
- అప్పనంగా దోచేసిన ప్రజాధనం
- నిజమైన క్రీడా స్థలాలు ఏర్పాటు చేయాలని క్రీడాకారుల వినతులు





నవతెలంగాణ-ఉప్పునుంతల

గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా స్థలాలు ఏర్పాటు చేసి క్రీడాకారులను వివిధ గ్రామాల ద్వారా నైపుణ్యపరిచే విధంగా చర్యలు చేపట్టింది కానీ క్షేత్రస్థాయిలో అధికారులు అప్పటి ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఆటకు అనువైన స్థలాలు కాకుండా ప్రభుత్వ స్థలం కనిపించిన చోట క్రీడా ప్రాంగణం అనే బోర్డులను పక్కపక్కనే రెండు మూడు రాడ్స్ పాతిపెట్టి అప్పనంగా ప్రజాధనాన్ని దొచేశారు. కానీ ఇప్పటివరకు ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం వాటిపై ఎలాంటి పూర్తి విచారణకు నజరు పెట్టలేకపోయింది. కొన్ని గ్రామాల్లో అయితే మరీ దారుణం పాఠశాల, చెరువులు, కుంటలు, కంపచెట్లలో మొక్కలు పెంచే నర్సరీల వద్ద బోర్డులను ఏర్పాటు చేసి నిధులు డ్రా చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2022-23 సంవత్సరంలో మండల వ్యాప్తంగా 23 క్రీడా ప్రాంగణాలకు 97 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఇప్పటివరకు కేవలం పెద్దాపూర్ గ్రామాల్లో పూర్తి చేసినట్లు మిగతా గ్రామాల్లో పెండింగ్ ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుస్తుంది. ఐతే ఇప్పటికే ఆయా గ్రామాల్లో 14 లక్షల పై చిలుకు నిధులు డ్రా చేసినట్లు తెలుస్తోంది. సంబంధిత స్థానిక అధికారులు కూడా ఎక్కడెక్కడ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు అనువైన స్థలాలు కేటాయించారా లేదా అనే కోణంలో విచారణ చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా మరికొన్ని గ్రామాల్లో క్రీడా స్థలాలను ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు అందజేస్తున్నారు క్రీడాకారులు. జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టి క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించి క్రీడాకారులకు క్రీడలకు అనువైన ప్రదేశాలను గుర్తించి ఏర్పాటు చేయాలని అదేవిధంగా క్రీడా ప్రాగణాల పనులు నిర్వహించకుండా అక్రమంగా నిధులు డ్రా చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులపై చర్యలు చేపట్టి డబ్బులు రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఉగాది ఉత్సవాలు



నవ తెలంగాణ - మరికల్

మరికల్ మండలం కేంద్రంలో ఆదివారం ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం మండల కేంద్రంలో ప్రజలు మామిడి తోరణాలతో అలంకరించి, తమ కుల దేవతలు, దేవుళ్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీపివంటకాలతో ఆరగించారు. యువక మండలి ఆధ్వర్యంలో సాయంత్రం దసరా కట్ట వద్ద కాషాయజెండా ఎగరవేశారు. అనంతరం హనుమాన్ వాడలోని ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర పంచాంగ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేద పండి తులు శ్రీనివాస్ శర్మ సుందరయ్య శర్మ, ప్రభు శర్మ, వెంకటేష్ శర్మ, వసంత్ శర్మ, పండితులతో పంచాంగాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజలకు పచ్చడి కార్యక్ర మాన్ని ఉచితంగా అందజేశారు. మరికల్ మండలంలోని పలు గ్రామాలలో ఘనంగా ఉగాది ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచి కే గోవర్ధన్, రాజమూరు కొండారెడ్డి, హరీష్ కుమార్, బోయ చంద్రప్ప, శెట్టి వీరభసంతు, మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్, జె మల్లయ్య కాటే కొండ ఆంజనేయులు, లంబడి తిరుపతయ్య, ఎల్ రాములు, సూరటి శ్రీనివాస్, మోహన్ రెడ్డి, రాజేష్, అఖిలపక్ష నాయకులు, మాజీ యువకుమండలి అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్ పథకాన్ని..
సద్వినియోగం చేసుకోండి

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు హరీష్‌కుమార్

నవ తెలంగాణ - మరికల్



మండలంలోని యువతీ, యువకులు, రాజీవ్ యువవికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరి కల్ మండల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్య క్షులు హరీష్‌కుమార్ సూచించారు. ఆదివారం ఉగాది పర్వది నాన్ని పురస్క రించుకొని ఉగాది శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వైట్ రేషన్ కార్డు ఉంటే ఇన్కమ్ సర్టిఫికెట్ అవసరం లేదని, అప్లికేషన్ ఫామ్ సవరించడం జరిగిందని , రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథ కంలో భాగంగా అన్ని కులాల వారికి స్వ యం ఉపాధి కల్పించేందుకు నాలుగు లక్షల వరకు ఆర్థిక సాయం అంది స్తుందని అన్నారు. అర్హత కలిగిన యువతీ యువకులు ఏప్రిల్ 5 లోపు మీసేవ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్విని యో గం చేసుకోని మండల యువకులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.

తిమ్మప్పస్వామికి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ - మల్దకల్

మండల కేంద్రంలోని ఆదిశిలా క్షేత్రం స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఉగాది పర్వదినం సందర్భంగా గద్వాల సీఐ టంగుటూరి శ్రీను కుటుంబ సమేతంగా స్వామివారిని సందర్శిం చుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు స్వామి వారి శేషవస్త్రం అందజేశారు. అలాగే గట్టు ఎస్ఐ కుటుంబ సమేతంగా హాజరై స్వామివారిని సందర్శిం చుకుని పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మల్దకల్ ఎస్ఐ నందికర్ గట్టు ఎస్ఐలు పాల్గొన్నారు.

మెథడిస్ట్ చర్చి నిర్మాణానికి నగదు అందజేత



నవ తెలంగాణ - గట్టు

మండలంలోని బల్గేర గ్రామంలో మెథడిస్ట్ చర్చి నిర్మాణానికి 500 బస్తాల సిమెంట్‌కు కావలసిన డబ్బులును, నాయకులు గిరప్పగాళ్ళ రామక్రిష్ణ నాయుడు చర్చి పెద్దలకు అందజేశారు. చర్చి నిర్మాణం జరిగి ఆ దేవుని ఆశీస్సు లు ఎల్లవేళలా ఆయన కుటుంబంపై ఉంచాలని వేడుకున్నారు. ఈ కార్యక్ర మం లో రామకృష్ణ నాయుడు కుటుంబ సభ్యులు చిన్న గిరప్ప, రమేష్, హనుమంతు హను మంతు ,భా స్కర్, రాజేష్, ప్రసాదు, సంఘస్తులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పదవి విరమణ



నవతెలంగాణ - దామరగిద్ద

మహబూబ్ నగర్‌లో జరిగిన పరమాత్మ పదవీ విరమణ కార్యక్రమంలో దామర్‌గిద్ద వాసులు మాలాల జాతీయ రాష్ట్ర ఉపాధ్యాక్షులు గ్యాంగ్ హన్మంత్, అంబేద్కర్ కమిటీ మెంబెర్స్ వై. తిమ్మప్ప, బక్క మాణిక్యప్ప, హన్మంత్ ఆచారి, మన్నే భీంషప్ప, కావాలి భీంశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతరోత్సవాలు



నవతెలంగాణ దామర గిద్ద

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం అన్నాసాగర్‌లో పోతురాజు జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి , ఫౌండేషన్ సభ్యులు అలాగే అన్న సాగర్ గ్రామస్తులు, అధికారులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మాన్‌దొడ్డిలో తాగునీటికి కటకట

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- స్థానిక అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఫలితం శూన్యం
- ఇబ్బందుల్లో వార్డు ప్రజలు
- శుద్ధ నీటిని అందించాలని గ్రామస్తుల వేడుకోలు



నవతెలంగాణ - రాజోలి

రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. 11వ వార్డులో గత ఆరు నెలల నుంచి తాగునీటి సర ఫరా సక్రమంగా చేయక పోవ డంతో గ్రామ స్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. వార్డు సభ్యులు, స్థానిక అధికా రులకు సమస్యను విన్నవిం చుకున్న ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో చేసేదేమీ లేక నిస్సహాయ స్థితిలో తమకు సరిపడ పరిమితిలో నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరు తున్నారు. అలాగే పారుతున్న కొంతపాటి నీరు కూ డా దుర్వాసన వస్తుందని, అధికారులు దీనిపై స్పం దించి వెంటనే పరిశుభ్రమైన నీటిని అంది ంచాలని ప్రజలు కోరుతున్నారు.

మిషన్ భగీరథ నీరు కలుషితం..



మండలంలోని మాన్ దొడ్డి గ్రామంలో మిషన్ భగీరథ నీరు కలుషితంగా వస్తుంది. దీంతో ప్రజలు భయా ందోళనలకు గురవు తు న్నారు. ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చే ందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందిస్తోంది. కొంతమంది అధికారులు నిర్లక్ష్యంతో ఆ నీరు తాగడానికి ఏమాత్రం ఉపయోగపడడంలేదు. ఉన్నతా ధికారులు తగు చర్య తీసుకుని స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలి.

- ఆంజనేయులు, మాన్‌దొడ్డి

పైప్‌లైన్‌కు మోటార్లు ఏర్పాటు..



గ్రామంలోని మిషన్ భగీరథ పైప్ లైన్లకు మోటర్లను ఏర్పాటు చేసుకుని అక్రమంగా నీటిని వినియోగిస్తున్నారు. దీంతో మోటార్ల చుట్టూ పక్కల ఉన్న ఇళ్లకు నీటి సరఫరా కావడం లేదు. అధికారులు స్పందించి మోటార్లను స్వాధీనం చేసుకొని అందరికీ నీరందేలా కృషి చేయాలి .

- సరోజమ్మ , మన్‌దొడ్డి

త్వరలో సమస్యను పరిష్కరిస్తాం..



మాన్‌దొడ్డి గ్రామంలోని 11వ వార్డులో మిషన్ భగీ రథ నీటి సమస్య ఉన్నది వాస్తవమే. తనదృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని సంబంధించి అధికా రులతో చర్చించి అక్ర మంగా వినియోగిస్తున్న మోటార్లను సీజ్ చేసి స్వాధీనం చేసుకుంటాం. త్వరలో నీటి సమస్యను పరిష్కరిస్తా.

- మహమ్మద్ ఖాజావలి, ఎంపీడీవో, రాజోలి.

ఒండ్రు మట్టితో.. పంటలకు అనేక లాభాలు

- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ డెస్క్

గత వేసవి కాలంలో చెరువులో నీళ్లు లేని సమయంలో అందులోని మట్టిని తీసి పంట పొలాల్లో వేసేవారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పొలాలకు చెరువులో ఉన్న ఒండ్రు మట్టి రైతుల పొలాలకు తరలించేవారు. ప్రస్తు తం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చెరువులో ఉన్న ఓండు మట్టి రైతులు పొలాలకు తరలించి పనులు లేకపోవడంతో చెరువుల్లో ఉన్న ఓండు మట్టి తరలించే పరిస్థితి లేకుండా పోయింది. ఒండ్రుమట్టి పొలాలలో వేస్తే రెండు అనేక ప్రయో జనాలు కలుగుతాయని మండల వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. చెరువు మట్టిని పొలాలలో తీసుకోవడం పంట పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు. వర్షాలు పడినప్పుడు సారవంతమైన మట్టి మొత్తం వచ్చి చెరువులోకి చేరుతోంది. దీంతో వేసవిలో నీళ్ల తక్కువ ఉండటంతో ఈ మట్టిని పూడిక తీయడం ద్వారా మళ్లీ వచ్చే ఏడాది చెరువుల్లో నీటి నిల్వలు పెరుగుతాయి. చెరువు నుంచి తీసిన మట్టిని పంట పొలాల్లో వేయడం ద్వారా ఆ పొలాలు సారవంత మవు తాయని వ్యవసాయ శాఖ అధికారులు సూచి స్తున్నారు. చెరువు మట్టి రూట్‌ను బట్టి అందులో పోషకాలు ఆధారపడి ఉంటాయని, ఇందులో ఆమ్ల , క్షార తత్వాలతో పాటు పురుగు మందుల అవిశేశాలు ఉండే అవకాశం ఉంటుందని , చెరువు మట్టి తర లించే ముందు పూడికస్థాయిలోతు విస్తీర్ణం గమ నించి తీయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచి స్తున్నారు. మట్టిలోని పోషకాల స్థాయిని గుర్తించేం దుకు మట్టి పరీక్షలు చేయించాలని. ఇలా కనీసం రెండు, మూడేళ్లకు ఓ సారి పొలంలో మట్టి నింపు కోవడం ద్వారా వర్షాల వల్ల కోతకు గురైన భూము లకు ఇది మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. చెరువు మట్టితో పాటు పశువుల పెంట ఉపయోగించటం వంటివి చేయ టం వల్ల భూమి గుల్లబారి నెలకు సరైన పోషకాలు అందే అవకాశం ఉంది. ఊట్కూర్ మండలంలోని 23 గ్రామపంచాయతీలో వర్షాధార చెరువులు ప్రస్తుతం అడుగంటి పోతున్నాయి. ఎండిన చెరువుల్లో రెండు నుంచి మూడు అడుగులు మేర పేరుకుపోయిన మట్టిని పంట పొలాల్లో వేసుకుంటే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. భూమిలో ఇప్పటికే ఉన్న మట్టితో ఇది కలిసిపోయి పంట సాగుకు ఇది అనుకూలంగా మారుతుంది. వర్షాలు బాగా కురిసినప్పుడు ఎత్తయిన ప్రదేశాల నుంచి వర్షపు నీటితో పాటు ఇసుక బంక మట్టి ఒండ్రు మట్టి వివిధ పొలాల్లో కుళ్లిన వాటితో కలిసి చెరువులోకి చేరుతాయని, నీరు ఉన్నంతకాలం లోపల కుళ్లి మంచి సేంద్రియ ఎరువుగా మా రుతోంది. పంటలకు అవసరమైన నత్రజని, బా స్వరం పుటాసులతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయని పేర్కొంటున్నారు. చెరువు మట్టిని పొలాల్లో వేయటం ద్వారా ఆమ్లా క్షర గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు.సూక్ష్మ స్తుల పోషకాలతో పాటు ముఖ్యంగా నత్రజని స్థాయి పెరుగుతుంది. సేంద్రియ ఎరువులను కూడా కలిపి పొలాలలో వేసుకోవడం ద్వారా రసాయన ఎరువుల వాడడానికి తగ్గించవచ్చు. చెరువు మట్టిలో సూక్ష్మజీవులు కూడా ఎక్కువగా ఉంటాయని , ఇవి నేలలో పోషకాలను పెంచుతాయని కరువు, వర్ష భావ పరిస్థితులను సైతం ఎదుర్కొనే శక్తిని నెలకు అందిస్తుందన్నారు మొక్కలు ఎత్తుగా ఆరోగ్యంగా పెరుగుతాయని పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది. .

ట్రాక్టర్ రివర్స్‌గేర్ పోటీల..
విజేతలకు బహుమతుల ప్రధానం



నవతెలంగాణ - పెద్దకొత్తపల్లి

ఉగాది పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని మర్రికల్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఇమాన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలను తన సొంత ఖర్చులతో నిర్వహించారు. అనంతరం మొదటి బహుమతి గెలుపొందిన పుట్ట రాముడుకు మూడు వేల రూపాయల నగదును, రెండో బహుమతిని గెలు చుకున్న పుట్ట శ్రీకాంత్ కు రూ.2000ల బహుమతి, మూడో బహుమతిని గెలుచుకున్న రాచూరి శ్రీను కు వెయ్యి రూపాయల బహుమతి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఇమాన్ గౌడ్ పుట్ట కృష్ణవేణి రాముడు ఎండీ హబీబ్, నరేంద్ర చార్యులు అందజేశారు. . ఈ కార్యక్రమంలో ఎండీ నిరంజన్ మారేడు నారాయణ , దాసరి వెంకటస్వామి, బీరం రవీందర్ రెడ్డి , మారేడు యాదగిరి, బొల్లె రాములు , నక్క స్వామి , ఆజం అలా దిన్ , ఇమాన్ గౌడ్ ,ఎండీ ఆశు కుమ్మరి కాశన్న , పుట్ట వెంకటయ్య , చెంచు బాలయ్య, గ్రామ కాంగ్రెస్ నాయకులు , గ్రామస్తులు , యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన గృహప్రవేశ వేడుకల్లో..నాయకులు



నవతెలంగాణ - పెద్దకొత్తపల్లి

విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన పెద్దకొత్తపల్లి మండలం మాజీ జెడ్పిటిసి మేకల గౌరమ్మ చంద్రయ్య దంపతులు తన సొంత గ్రామమైన మారేడు మానుదిన్నే గ్రామంలో నూత నంగా నిర్మించుకు నారు నూతన గృహప్రవేశ కార్యక్ర మానికి ఆహ్వానించగా పెద్దకొత్తపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు దండు నరసింహా , సింగిల్ విండో మరియువైసమ్మ చైర్మన్ బుడుగు శ్రీనివాసులు హాజరై ఇంట్లో జరిగిన వెంకటేశ్వర స్వామి వ్రతానికి హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరిం చారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మేడుపూరి విష్ణు , సింగిల్ విం డో డైరెక్టర్ దండు చంద్రయ్య , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలునాయక్ గారు, వెంకట స్వామి , తగిలి బాలస్వామి , సుధాకర్ , దాదే చంద్రయ్య , యువ నాయకులు బ్యాగరి మల్లేష్ , తది తరులు పాల్గొన్నారు.

రంజాన్‌ను శుభాకాంక్షలు



నవతెలంగాణ - నారాయణపేట

రంజాన్ పండుగ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లాలోని ముస్లిం సోదరులకు ఆదివారం ఒక ప్రకటనలో రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నారాయణపేట జిల్లా పరిధిలోని ఈద్గాలు, మసీద్‌ల వద్ద పటిష్ట పోలీసు బందో బస్తు ఏర్పాటు చేయడం జరిగిం దని, ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగు తుందని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ప్రధాన చౌరస్తాలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలందరూ సోదరభావంతో పండగలు సుఖ సంతోషాలతో, కుటుంబ సభ్యులతో కలిసి శాంతి యుతంగా జరుపు కోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు ఫేస్బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్ తదితర వాటిలో ఒకరిని కించ పరిచే విధంగా పోస్టులు చేయరాదని, ఇతరుల మనో భావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెట్ట రాదని పేర్కొన్నారు. సోషల్ మీడియా పై పోలీసు వారి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎవరైనా అనుచిత పోస్టులు పెడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమాజంలో శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



జాతరోత్సవాల్లో.. ఎమ్మెల్యే

నవ తెలంగాణ - నారాయణపేట

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలో ఆదివారం కనకరాయస్వామి జాతర ఉత్సవాల్లో నారాయణపేట శాసనసభ్యులు డాక్టర్ చిట్టెం పర్ణికరెడ్డి పాల్గొన్నారు. కనకరాజు స్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే ను శాలువాతో సన్మా నించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప, మండల అధ్యక్షులు బాల్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చేతిరాళ్ల పోటీలు ప్రారంభం



నవ తెలంగాణ - గట్టు

మండలంలోని రాయపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్క రించుకుని బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతిరాళ్ల పోటీలను గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడును గ్రామస్తులు శాలువా కప్పి, ఘనంగా సత్కరి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ గ్రామ ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ యువ కులు అన్నీ రంగా లలో ముందంజలో ఉండాలన్నారు. ఉగాది పర్వదినం పురస్క రించుకొని చేతిరాళ్ల పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. పోటీలలో గెలుపోట ములను సహజమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయ కులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

జోరుగా ఇసుక దందా

- గుట్టుచప్పుడు కాకుండా అర్థరాత్రి ఇసుక తరలింపు

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ డెస్క్

అక్రమ ఇసుక రవాణ ఊట్కూర్ మండలంలో జోరుగా కొనసాగుతోంది. అర్థరాత్రి అయితే చాలు ఇసుక వాహనాలు రై రై అంటూ ఇసుకను నింపుకొని అతివేగంగా వెళుతున్నాయని పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి సమయంలో ఎవరూ దృష్టి పెట్టారనే సాకుతో అక్రమ ఇసుక రవాణా కొనసా గుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. అర్ధరాత్రి ఇసుక వ్యాపారం కొనసాగడంతో వీటిపై ఎవరూ దృష్టి పెట్టకపోవడంతో ఇదే అదునుగా భావించి నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఇసుక దందా మూడు పూవులు ఆరు కాయ లుగా విర జిల్లుతుందని పలువురు విమర్శిస్తున్నారు. అడ్డగోలు సంపదకు ఆదాయ వన రుగా ఈ ఇసుక రవాణా ఉందని విమర్శలు వ్యక్త మవుతున్నాయి. అక్రమంగా ఇసుక తరలించకుండా అన్ని ప్రాంతాల్లో గట్టిగా ఏర్పాటు చేశామని అధికారులు అంటున్న మరో పక్క మండలంలోని అమీన్‌పూర్ గ్రామ సమీపంలో పెద్దవాగు నుంచి అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు ఇసుక వాహనాలు తిరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా దారులు అక్రమ ఇసుక రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. అర్ధరాత్రి కావడంతో అధికారులు పట్టించుకోరని సాకుతో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. అర్ధరాత్రి అక్రమ ఇసుక సరఫరా చేస్తూ దందను నడిపే వారిని అరికట్టే వారు ఎవరూ లేరా అని ప్రశ్న ప్రజల్లో వ్యక్తం అవుతోంది. వేసవి కావడంతో ఇండ్ల నిర్మాణాలు జరుగు తుండడంతో ఇసుకకు భారీ డిమాండ్ లేకపోలేదని, ఇదే అదునుగా తీసుకొని అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఓ ప్రాంతంలో ఇసుకను డంపింగ్ చేసుకొని రాత్రి వేళలు ఇసుకను తొలగిస్తున్నట్లు విమర్శలు లేకపోలేదు. ఇసుక భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్లు ధ్వంసమై గుంతల మయంగా మారి దెబ్బతినే అవకాశం లేకపోలేదు. దీంతో రోడ్లపై వాహనాలు ఇలాగనే తిరిగితే రాబోయే రోజుల్లో రాకపోకలకు ఇబ్బందికరంగా ఏర్పడు తుందని ప్రజలు వాపొతున్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిని సంబంధిత శాఖ అధికారులు గుర్తించి అక్రమంగా ఇసుక రవాణాను అరిక ట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

దుబ్బతండాలో..
లింగామసంద్ ప్రథమ వార్షికోత్సవం





నవతెలంగాణ - వెల్దండ

వెల్దండ మండల పరిధిలోని పోచమ్మ గడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బ తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన లింగామసంద్‌మటన్ ప్రథమ వార్షి కోత్స వేడుకలు తుల్జా భవానీ సేవ సమితి ఆధ్వర్యంలో జరుపుల బ్రదర్స్ ఆది వారం ఘనంగా నిర్వహించారు. తండాలో విగ్రహాలకు ఊరేగింపు నిర్వహి ంచా రు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జరుప్ల నానక్ రాం, ఫకీర నాయక్, ఉమాపతి, అమర్ సింగ్ ,శంకర్, హనుమంతు, రాజా రామ్ ,డాక్టర్ శివరాం, డాక్టర్ చందు , గ్రామ పెద్దలు తుల్జా నాయక్, శీను, దేశ్య, పవన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.